కథానిక

# ఎవరి అసూయ?

కె. రామలక్ష్మి

దూరంగా మినుకు మినుకుమంటూ దీపాలు వెలుగుతున్నాయి. అవి విద్యుద్దీపాలే అయినా వాటి కాంతి అంత దూరాన వుండబట్టి ఎర్రగానూ పచ్చగానూ వుండి ఆముదం దీపాల్లాగా హరికేను లాంతర్ల వెలుగులాగా కన్పిస్తూంది. రైలు బండి ఎంతో వేగంగానే పోతూంది. దానికేం భాధలేదు. అది రైల్వేవాళ్లు నిర్ణయించి టైముకి ఫలానా ఫలానా స్టేషన్లలో వుంటూ పోతూ వుండాలి. అదే దాని ధ్యాస. ఆరైలు పెట్టెల్లో ఎందరెందరు మనుషులు ఎన్నెన్ని పనులమీద బయలుదేరి పోతున్నారో తల్లియింటికి తరలిపోయే గర్భిణీలూ, తెల్లారితే కోర్టువాయిదాలకిపోయే రైతులూ, పెద్దలూ, రైలుమారి రైలెక్కుతూ జలసా కేంద్రాలకి ఎన్ని కష్టాలైనా పడి సాగిపోయే యువకులూ, ధనికులూ...ఎందరెందరో ఆరైళ్లో ప్రయాణిస్తూండవచ్చు. కాని రైలుబండికీ డ్రైవరుకీ వీరి పట్టింపేంలేదు. వారిపని వారిది. తత్త్వాలు పాడుకుంటూ చిడతలు వాయిస్తూ పెట్టెమార్చి పెట్టచూసే గుడ్డి ముష్టివాడికి చీకటీ అడ్డుచెప్పదు. భయమూ అడ్డుచెప్పదు...రైలు సాగిపోతూంది. మైలు బండికనుక మరీ హడావిడిగా సాగిపోతూంది.దూరంగా దూరదూరంగా వెళిపోతున్నా దీపాలు మిళుకుమిళుకు మంటూ తోరణాల్లా కన్పిస్తూనే వున్నాయి...

సాగిపోతూన్న రైలుబండిలో ఒకమూల పెట్టెలో కిటికీదగ్గర స్థానాన్ని ఆక్రమించుకుని... దూరంగా పోతూకూడా మళ్ళీమళ్ళీ కన్పిస్తూన్న దీపాలవంక అదేధ్యానంగా చూస్తూ కూర్చున్నాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి రైలు తెల్లారితేగాని గమ్యం చేరదు. ఇంకా యిప్పుడు రాత్రి పన్నెండు గంటలేనా కాలేదు. కంటిమీద కునుకు రాక, నిద్రపోవాలన్న కోరిక పీడిస్తూంటే కూడా లెక్కచెయ్యక, అలా దీపాలకేసి చూస్తూ గతించిన ఘట్టాలలో మళ్ళీ మళ్ళీ తాను బ్రతుకుతున్నాడు. ఉండి వుండీ యీ వర్తమానంలో పడుతూనూ వున్నాడు. టైము చూస్తూన్నాడు. మళ్ళీ దీపాలు చూస్తున్నాడు కృష్ణమూర్తి.

రైలు తనవూరికి దూరం అవుతున్నకొద్దీ, తను రాధాయివూరుకి దగ్గిర పడుతూన్నకొద్దీ కృష్ణమూర్తి హృదయంలో మాటలకందని ఏదో ఆవేదన అలముకోసాగింది. రాధాయి ఎందుకింత అర్జంటుగా రమ్మని రాశాడు? అయినా ఎన్నో సీరియస్ విషయాలనే చులాగ్గా తీసుకొనే తనెందుకింత హుటాహుటిని ప్రయాణమయ్యాడు—తలుచుకుంటే కృష్ణమూర్తికే ఆశ్చర్యంగావుంది. తను బయలుదేరబోతూంటే పార్వతి అన్న మాటలకి యిప్పుడు ఆందోళనగానూ వుంది. 'నాకు తెలుసులే ఎందుకో అంత హడావిడి రాధాయివున్న వూరు మాదవరం కాదుగా? శుద్ధ చెన్నాపట్నం ఆయిరీ" అంది పార్వతి, కృష్ణమూర్తి ప్రయాణానికి బట్టలు సద్దుతూనే. "అలా అంటావేమిటి పార్వతీ రాధాయి నీకు చుట్టంగాని నాకు స్నేహితుడు. ఏదో అర్జంటైతేగాని అలా ఉత్తరం రాస్తాడా? అయినా చెన్నాపట్నం నీకొత్తా? నాకొత్తా?"

"మనిద్దరికీ, రాధిగాడికీ కొత్త అని నేనన్నానా? చెన్నాపట్నం అనూరాధకి కొత్త! అనూరాధతో చెన్నపట్నంలో మీకు కొత్త! అదేనేననబోయినది" సాగతీసుకుంటూనే పార్వతి సమాధానం చెప్పేసరికి కృష్ణమూర్తికి కోపమే వచ్చింది. కాని ఏం చేస్తాడు? ఎంత విసిగించినా పార్వతి ప్రేమింపదగిన వ్యక్తి అని ఏనాడో గుర్తించాడు. ఆ నిజం తెలుసుకున్నాక, ఆమెమీద అభిమానం తప్ప కోపం పుట్టదు. ఏందారి? "అలా అంటావేమిటి పార్వతీ, అనూ అంటే మీ అన్నాయి పడి చస్తాడు కదా, మధ్యని నన్నుమానించి, అలా బాధపడి పోతావెందుకూ?" కొంటెగా చూస్తూ అడిగిన కృష్ణమూర్తికేసి తీక్షణంగా చూసింది పార్వతి.

"అనూరాధ అన్నయ్య కెంత స్నేహితురాలో నీకూ అంతేగా!" అందిపార్వతి. స్నేహంగావున్నంత మాత్రాన ప్రేమించేసినట్టే నేమిటిలెక్క. ఉత్తి పల్లెటూరిదానికంటె అన్యాయం పార్వతీ నువ్వు. చదువు సంధ్యలు నీకేమాత్రం హృదయ వైశాల్యాన్నీయలేదు సరిగదా, వున్న బుద్ధిని పెడతలకునెట్టాయి" కృష్ణమూర్తి గదివదిని బయటికినడిచాడు.

అసలా క్షణాలో అలా అంటూనే కృష్ణమూర్తి తనని దగ్గరకి తీసుకుని, ఉట్టినే అన్నానులే అన్న ధోరణిలో, లాలిస్తాడని ఎదురుచూసిన పార్వతికి నిరుత్సాహం కల్గింది. ఔను! యీ క్షణాలో నే నెవరు? చిన్ననాటి స్నేహితురాలు, రాధాయి పిలుపు యీ కృష్ణమూర్తిని యీ లోకమే మరిచిపోయేలా చేశాయి. ఔనుమరి తన నెందుకు ఓదారుస్తాడు? తనను హృదయపూరా ఆరాధిస్తాననీ తను లేకుంటే క్షణం ఒక యుగమనీ అని అని అలిసిపోయే కృష్ణమూర్తేనా-యీ కృష్ణమూర్తి. ప్రియురాలు భార్య కాగానే అంతే కాబోలు. అసూయా, అసహాయతా దావానలంగా అలముకొని కన్నీటితో పార్వతి దృష్టి మసక అయింది. కళ్ళనీళ్లైనా తుడుచుకోకుండా బట్టలు సర్ది కృష్ణమూర్తి ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసింది. రైలుస్టేషనుకు వెడుతూ కృష్ణమూర్తి ఆప్యాయంగా దగ్గరకి తీసుకున్నా, తనూ అన్నీ మరిచిపోయి ఆనందంగా అతన్ని సాగనంపుదామని లోలోపల అనుకున్నా, ముభావంగానే వుండిపోయింది పార్వతి. కృష్ణమూర్తి చిన్నపోయాడు; అయినా రైలెక్కాడు.

...దూరంగానూ దగ్గరగానూ దీపాలు కన్పిస్తూంటే పార్వతిలో తన తొలి పరిచయమూ, అన్నీ గుర్తుకువచ్చి-చిలిపి సంఘటనలూ, చిలిపి కజ్జాలూ జ్ఞాపకంవచ్చి - రైలుపెట్టెలో మూల సీటులో కూర్చున్న కృష్ణమూర్తి నవ్వుకున్నాడు. అయినా ఆ పార్వతికోసం కష్టపడి మొత్తానికి ఒప్పించి చేబట్టకలిగాడు...

ఆ రోజుల్లో కృష్ణమూర్తిని చూస్తే చాలు పార్వతి మండిపడేది. రాధాయికోసం వస్తే చాలు ఏదో సణుగుడు. అది విని రాధాయీ కృష్ణా కూడా తెగ నవ్వుకునేవారు. 'మీది కబంధమతం' అంటూండేది. 'అందమైన అమ్మాయి కన్పిస్తే చాలు మీకు' అన్నపానాదు లక్కరలేకుండా తిరుగుతారు' అనేది. 'అవునేమరి, అందమైన ప్రకృతినీ అందమైన సుందరాంగులనీ దేవుడెందుకు సృష్టించా డంటావు? చూసి సంతోషించడానికి కాదూ? ఏరా కృష్ణా' అంటూ రాధాయి మరీఏడిపించేవాడు. అసలు రాధాయి పాడుకావడానికి కృష్ణమూర్తే కారణం అని పార్వతి గట్టినమ్మకం.

అవునుమరి ఆ రోజుల్లో రాధాయీ కృష్ణా కూడా స్వేచ్ఛాజీవులే. కృష్ణమూర్తి పుష్కలంగానే సంపాదిస్తున్నాడు. రాధాయి టీచరు. పార్వతికి లెక్కలేనంతమంది స్నేహితురాళ్ళు. ఇంక లోటేం? పార్వతి స్నేహితురాళ్ళని ఎప్పుడూ యింటికి తీసుకువస్తూనే వుండేది. వాళ్ళలో ఒకత్తే యీ అనూరాధ. అనూరాధ చెలాకీ పిల్ల. అందుకే కృష్ణమూర్తి నిట్టే ఆకర్షించింది. రోజూ సాయంత్రాల వచ్చి కూర్చునేది: ఏదో బాతాకానీ. పార్వతికి మొదట్లో యిదంతా తమాషాగా వుండి తనూ ఆనందించేది. కాని ఏ రోజైతే కృష్ణమూర్తి అనూరాధ రాక పోకలకి అతి ప్రాముఖ్యం యిస్తున్నాడని అనుకుందో-ఆ రోజునుంచీ ఆమె పూర్తిగా మారిపోయింది. అనూరాధ వచ్చి హాల్లో బాతాకానీ వేస్తున్నా పార్వతి ఇవతలికే రావడం మానేసింది. కృష్ణ చిన్నబుచ్చుకున్న సంగతీ గమనించింది: అదే శాస్తి-అన్నట్లు సంతోషించింది. రోజులూ, వారాలూ గడుస్తూనే వున్నాయి. అనూరాధ రానూవస్తూంది. యింట్లో రాధాయి యీలపాటలూ ఎక్కువయాయి. మనస్సులో కుమిలిపోతున్న పార్వతికి వుండుండి జర్వంవచ్చి నంతపనీ అవుతూంది, కృష్ణమూర్తి రావడం మానేశాడు. అనూరాధ వస్తూనేవుంది. యిది పార్వతి కొంత హాయిని కల్గించినా కృష్ణ రాకపోతే ఎలా. అన్న వ్యథ మాత్రం మిగిలింది...

కాలం గడిచిన కొద్దీ పరిస్థితులూ మారాయి. పార్వతిని కృష్ణమూర్తి వివాహం చేసుకున్నాడు. రాధాయి టీచరుగా మద్రాసు వెళ్ళిపోయాడు. అన్నీ సవ్యంగా సాగిపోతున్నాయి. కాని నెమలి పింఛంలో కాకి యీకలా పార్వతి పాలకడలి లాంటి హృదయంలో వుండుండీ, కృష్ణమూర్తి గతం జ్ఞాపకంవచ్చి పొగలు చెలరేగుతూనే వున్నాయి. కృష్ణమూర్తి-ఓ చిన్న చేష్ట, ఓ చిన్న

మాట ఓ కొంటెచూపు ఏదో ఒక సమయంలో పార్వతి హృదయానికి ములుకులా తగలడం దానితో పార్వతి కోపగించుకుని, వుడుక్కుని అన్నం మానేయడం, జరుగుతూనేవుంది. అయినా "సర్వం నువ్వే" అనుకున్నవ్యక్తి ప్రతి కదలికా ఎదుటి హృదయంలో సమకదలికలు కల్గించడం సహజం. అందుకే పార్వతీ కృష్ణమూర్తీ అలాగ!

ప్రశాంతంగా రోజులు గడుస్తున్నాయి. రాధాయిని వేసవి సెలవులకి యింటికి రమ్మని రాసింది పార్వతి. వస్తానన్నాడు ... సెలవులు చిన్ననాటిలా హాయిగా గడుస్తాయని కలలు కంటున్న పార్వతికి, రాధాయి హఠాత్తుగా రాసిన ఉత్తరం పీడకల అయింది...ఆ మధ్యనే ఒక రోజు కృష్ణ చెప్పగావింది: అనూకూడా మద్రాసులోనే వుందిట అని. ఇంకనేం? అన్నట్లు చూసిందే కానిఅప్పుడేం మాట్లాడలేదు. కాని యీ రోజు ఆ సంగతులు జ్ఞాపకం రావడం, కృష్ణమూర్తి హుటాహుటిని ప్రయాణం కావడం—అన్నీకలిసి పార్వతిని కల్లోలపరిచాయి. 'కృష్ణమూర్తి నావాడు' అన్న గాఢనిద్రలోవున్న పార్వతి ఉలిక్కిపడి లేచి పాతకాలం నెమరువేసుకుంది. అవును: యీ రోజు కృష్ణ నావాడు. కాని ఏడాదీ ఏణ్ణర్థం క్రితం? పెళ్ళయిన కొత్తలో ఏం చెప్పాడు? అనూ రాధ ఒప్పుకోలేదు కానీ లేకుంటే కళ్ళనద్దుకుని వివాహం చేసుకునే వాణ్ణి; అస లనూరాధ ఎవరైనా కోరదగ్గ వ్యక్తి. అనీ ఎంత గంభీరంగా చెప్పేవాడు!

అందుకే చెన్నపట్నం అర్జంటుగా రాధాయి రమ్మనడం, ఆ రాత్రికే కృష్ణమూర్తి ప్రయాణం కావడం ముఖ్యంగా అనూ రాధ అక్కడే వుందని జ్ఞాపకం రావడం అన్నీకలిసి పార్వతిని బాధ పెట్టాయి. అందుకే అలా అంది.

రైల్లోకూర్చున్నాడన్న మాటేగాని కృష్ణమూర్తికి రైలువదిలి యింటికి పోవాలనిపించింది. పార్వతిని దగ్గిరకి తీసుకుని — 'నువ్వు తప్ప నా కింకెవరూ సన్నిహితులు కారు పారూ,' అని ఓదార్చాలనిపించింది. ఏ క్షణాన్నైతే యీ వూహాలు రేగాయో ఇక మద్రాసు వెళ్ళ బుద్ధి పుట్టలేదు కృష్ణమూర్తికి. కాని తెల్లవారడమూ రైలు మద్రాసు చేరడమూ జరిగింది.

కృష్ణమూర్తి స్టేషనులోనే వుండి, రాధాయికి కార్డు రాశాడు, "నేను రాలేనందుకు క్షమించు; వీలుంటే, నువ్వు పార్వతికి ప్రామిస్ చేసినట్లూ మా వూరురా.' అని తిరుగురైల్లో ప్రయాణమయాడు కృష్ణమూర్తి. రైల్లో గంటలు లెక్కపెడుతూంటే కృష్ణమూర్తికి అనిపించింది: యీ రైలుకి యిన్ని చక్రాలుండి గొంగళీపురుగు నడక! ఈ రైలుకి రెక్కలుండ కూడదూ? పోనీ పార్వతి అనుకొన్నట్లు కబంధ హస్తాలైనా వుంటే, ఇంట్లో వాలుకుర్చీలో పడుకుని అనవసరపుటాలోచనలతో బుర్రపాడు చేసుకొనే పార్వతిని ఒక చేత్తో 'ఇలా' అందుకునేవాడు.

వారం పదిరోజుల ప్రయాణం ఒకరోజుతోనే ముగించుకొనివచ్చిన కృష్ణమూర్తిని చూసి ఆశ్చర్యపోయింది పార్వతి; మరుక్షణంలో అతనిగుండెల్లో తలదాచుకొని, 'నువ్విప్పుడప్పుడే రావు కాబోలనుకుంటున్నాతుండూ'అంటూ అనవసరంగా కన్నీరు కార్చింది. "అందుకే వచ్చేశానుగా. నువ్వొట్టి పిచ్చి పార్వతివి, అనవసరంగా నువ్వు బాధపడతావు.ఎదుటివారిని పెడతా"వంటూ తలనిమిరాడు కృష్ణమూర్తి.

అన్ని స్పర్థలూ, అనూరాధలూ-అన్నీ మరిచి హాయిగా 'కృష్ణమూర్తి నావాడు' అన్న ధీమాతో కూనిరాగాలుతీస్తూ తిరిగే పార్వతిని చూసి సంతోషించాడు ఎంత చిలిపిగా చిన్నపిల్లలా ప్రవర్తించినా, తనపట్ల పార్వతి అభిమానం వాటిల్లోనే విశదం అయేది అతనికి.

వారం గడిచింది. ఓరోజు రాధాయి అనూరాధతో సహా పెట్టే బెడ్‌తో దిగాడు. పార్వతి ఎంత ఆశ్చర్యపడిందో కృష్ణమూర్తీ అంతే ఆశ్చర్యపోయాడు: రాధాయిని చూసి పార్వతి, అనూరాధను చూసి కృష్ణమూర్తి.

"ఏరా రాధిగా ఏమిటి యీ గొడవ?" అన్నిటికంటే మొదటగా కృష్ణమూర్తి వేసిన ప్రశ్న.

"నిన్ను అర్జంటుగా రమ్మంట దేనికనుకున్నావు? అనూరాధ సడెన్‌గా ఒప్పేసుకుంది. మళ్ళీ ఆలస్యం ఎందుకనీ, నువ్వు సంతకం పెడతావనీ రమ్మనమన్నాను"చాలా ప్రశాంతంగాచెప్పాడు రాధాయి. తలుపునకానుకొని నిల్చున్న పార్వతి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసింది. "నిజమేనేమిట్రా అన్నాయ్" కుతూహలాన్నణచుకోలేక అంది.

"అవునే పారూ, అయినా మీ ఆయన్నలా కట్టేస్తే ఎలా. మద్రాసులో దిగినవాడు ఓరోజేనా వుండిపోకూడదూ. పోస్టుకార్డు రాసి తిరుగు రైలెక్కాడు." రాధాయి చెప్పుకుపోతూనే వున్నాడు. పార్వతి ముఖం కందగడ్డలా అయింది. వెనకనుంచి వచ్చిన అనూరాధ కలకల నవ్వింది.

"లెండి, స్నానాలూ భోజనాలూ అయాక విశేషాలు చెప్పుకుందురుగాని" అనూరాధే అంది.

"ఓ పెళ్లికూతురా! ఒంటిల్లు సర్దు మేంలేస్తాంలే."

అనూరాధా పార్వతీ లోపలికి వెళ్ళిపోయారు. నవ్వుకుంటూ కబుర్లుచెప్పుకుంటూ భోజన ప్రయత్నాలు చేస్తున్నారు.

"ఏరా కృష్ణా ఏమిటి కథ?" కొంటెగా ప్రశ్నించాడు రాధాయి.

దీర్ఘంగా నిట్టూర్చి కృష్ణమూర్తి ప్రారంభించాడు... అంతా అయాక—

"ఆడదే అసూయ, అసూయే ఆడది. యిదేరా బ్రహ్మసూత్రం బ్రదర్" అంటూ ఆరిపోయిన సిగరెట్టు తిరిగి అంటించుకొన్నాడు కృష్ణమూర్తి. వంటింట్లో వుందనుకున్న పార్వతి మధ్యగదిలోనే వుండడంతో యీ మాటలు సూటిగా వినిపించాయి. వినిపించడమే తడవుగా "ఎవరా అనసూయ?" అంటూ యివతలికి వచ్చింది. సిగరెట్టు అంటుకోక తంటాలుపడుతూన్న కృష్ణమూర్తి ఉలిక్కిపడ్డాడు. 'చచ్చాంపో, ఏంచెప్పుకుంటావో చెప్పుకోరా" అంటూ భుజాన తుండుగుడ్డ పడేసుకుని స్నానాల గదిలోకి ధారితీశాడు రాధాయి. ఈ టోరెంటోని వున్న ఒక్క గాండీవంతోనూ ఎదుర్కొందామని నిశ్చయించుకుని కృష్ణమూర్తి కిమ్మనకుండా వూరుకొని చిరునవ్వు నవ్వుకున్నాడు. ఇక ఎటువంటి తిరుగుబాటునేనా భరిస్తుందికాని పార్వతి యీ నిశ్శబ్దంలో ప్రశ్నలని మింగేయడం మాత్రం భరించలేదు. అందుకే తీరుబడిగా దీని సంగతి తేల్చుకుందుకు నడుంచుట్టూ చీరకొంగు దోపి, రాధాయి ఖాళీచేసిన కుర్చీని ఆక్రమించుకొంది.

"రాధాయికి కాకరకాయలు ఇష్టంకదా వేయించలేకపోయావా" ఆప్యాయం ఉట్టిపడేలా అడిగాడు కృష్ణమూర్తి.

'వాడొక్కడికీఏందుకనీ, అందరికీ అదే కూరచేశా' వ్యంగ్యంగాముక్తసరిగా సమాధానంచెప్పింది పార్వతి.

ఎంత ప్రశాంతంగానో గడిచిపోతూందనుకున్న సంసారసాగరంలో తలెత్తిన యీ అనసూయ ఎవరు? నిట్టూరుస్తూ నుదుటికి చేయిచేర్చి కుర్చీలో జేరబడ్డాడు కృష్ణమూర్తి.

భోజనాల సమయంలో ఎంతో కలకల్లాడుతూ అందరినీ నవ్విస్తూ అన్నీ మరిపించింది అనూరాధ. రాత్రి సినిమాప్రోగ్రాం ప్లానుకూడా వేసేసి విశ్రాంతి కోసం నడుంవాల్చింది.

రాత్రి—రెండుఝాములు దాటిన నడిరాత్రిలో నిద్రలేచి కృష్ణమూర్తిని లేపింది పార్వతి. "నువ్వేం అనుకోను తుండూ, నా త త్వ మే అ ం త. యీమాట నీతో చెప్తేకాని హాయిగా నిద్రపట్టదు" చెరిగిన అతని తలని తన హృదయానికి హత్తుకుంటూ, అనవసరంగా కళ్ళనీళ్లు పెట్టూన్న పార్వతిని చూసి జాలేసింది కృష్ణమూర్తికి. ఆమెను దగ్గరకి తీసుకుని... అసలు సంగతంతా చెప్పి, నవ్వుతూ అన్నాడు: "నువ్వు పార్వతివి. ఒక్క పార్వతే యిలా చెయ్యగలదు. ఆడవాళ్ళంతా ఒక ఎత్తూ, పార్వతి ఒక ఎత్తాను."... అప్పుడే అన్నీ మరిచి మెరిసే కళ్ళతో—అంది: "చూడు కృష్ణా, అనూరాధ మంచిదే. ఎంత సరదా అయిందనుకున్నావు? అన్నీ చెప్పింది; ఎంతో ఆలోచించిన మీదటగాని యీ రాధిగాణ్ణి పెళ్ళాడ్డానికి నిశ్చయించుకోలేక పోయిందిట!"

"అదే మంచిది. లేకుంటే నీలా క్షణక్షణం అభిప్రాయ భేదాలతో సతమతమయేది!" వేళాకోళం చేశాడు.

"నేనూ ఆలోచించే చేసుకున్నాను. అసలు ఎన్ని వేల సంవత్సరాలగానో నీకోసం తపస్సు చేశానోయ్ అబ్బాయీ: యింక పడుకో." కొద్దిక్షణాల లోనే హాయిగా పార్వతి నిద్రపోయింది. కాని, కృష్ణమూర్తి మటుకు ఆలోచిస్తూనే వున్నాడు ఎవరీ అసూయ? అని... కిటికీలోంచి నక్షత్రాలు కనిపిస్తున్నాయి... రైలు పెట్టెల్లోంచి తనుచూసిన దీపాల తోరణాలూ—ఆపెట్టెల్లో తన వూహాలూ అన్నీ గుర్తుకు వస్తున్నాయి... అన్నిటిమధ్యా పెద్ద కళ్ళతో అమాయకత్వం ఆదరణా తొణికిసలాడే ముఖం ఒకటీ—ఎవరీ అసూయ? ఎవరీ పార్వతి?—నవ్వుకొంటూ తనని తనే ప్రశ్నించుకున్నాడు కృష్ణమూర్తి. ★